క్లుప్తంగా

తాగునీటి కోసం చర్యలు తీసుకోవాలని వినతి

మార్కాపురం: పట్టణంలో రాబోయే వేసవిలో ప్రజలు తీవ్రమైన నీటి సమస్యను ఎదుర్కొనున్నారని.. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మార్కాపురం ట్యాక్స్ పేయర్స్ అండ్ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు ఓరుగంటి మల్లిక్ కమిషనర్‌కు గురువారం పంపిన వినతి పత్రంలో కోరారు. పట్టణంలో ఉన్న బోర్లు, కుళాయిలు చాలా వరకూ ఉపయోగపడే పరిస్థితి లేదన్నారు. పట్టణ ప్రజలు మున్సిపాలిటీ టాక్స్ చెల్లిస్తున్నారన్నారు. ఈ వేసవిలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీకి సరఫరా చేసే దూపాడు సాగర్ కాలువలో నీటి ప్రవాహం తగ్గిందని, దీనివలన ఎస్ఎస్ ట్యాంకులో నీటి సరఫరా కూడా రోజు రోజుకు తగ్గుతోందన్నారు. సమస్య తీవ్రతరం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మల్లిక్ కోరారు.

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల అహ్వానం

రాచర్ల: 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను అహ్వానిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75 చెల్లించి మార్చి 31వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో స్థానిక పాఠశాలలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సనాతన ధర్మ ప్రచార పుసక్తం అందజేత



కమిషనర్‌కు పుస్తకం అందజేస్తున్న శివమల్లారెడ్డి

గిద్దలూరు రూరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వారి ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కమిషనర్ ఐ.శ్రీనివాసులును తన కార్యాలయంలో గురువారం కలిసి సనాతన ధర్మంపై రచించిన పుస్తకాన్ని నిర్వాహకులు అందజేశారు. ఈసందర్భంగా ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ పంట శివమల్లారెడ్డి మాట్లాడుతూ సనాతన ధర్మం గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అందులోని గొప్పతనాన్ని చదివి పదిమందికి తెలియజేయాలని కోరారు. భారత సంస్కృతి సాంప్రదాయాలను రక్షించుకోవడం దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరి భుజస్కంధాలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి, ఆర్ఎస్ఎస్ నిర్వాహకులు సూరె క్రిష్టారావు, ఎం.రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వెలుగొండ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం: పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ నాయకులు కోరారు. గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందించారు. పశ్చిమ ప్రాంతంలో శాశ్వతంగా కరువును నివారించే వెలుగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయడంతో పాటు నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు. ప్రాజెక్టు పూర్తయితే ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లో శాశ్వతంగా కరువు పోతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శాసనాల సరోజినీ, బొంతల కృష్ణ, చిన్నయ్య, మద్దెల లక్ష్మీ తదితరులు ఉన్నారు.

రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

ఒంగోలు సిటీ: పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ కిశోర్‌బాబు అన్నారు. గురువారం ఒంగోలు మండల పరిధిలోని కొప్పోలు, చెరువుకొమ్ముపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కర్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ– పంట నమోదు చేసుకున్న ప్రతి ఒక్క రైతు ఈకేవైసీ చేయించుకోవాలని, అప్పుడు మాత్రమే రైతుకు నష్టపరిహారం వచ్చేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. రైతుకు 11 అంకెల విశిష్ట నంబర్ కోసం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద పేర్లు నమోదు చేసుకొని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. వ్యవసాయ విస్తరణాధికారులు ఆదిమూర్తి, రామకృష్ణారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు హిమబిందు, హైమావతి, పాల్గొన్నారు.

క్షణ క్షణం.. భయం భయం..!



వీఆర్వోల గదిలో టేబుల్‌పై పడిన పెచ్చులు (ఫైల్)



పెచ్చులూడుతున్న స్లాబు

- శిథిలావస్థలో నాగులుప్పలపాడు తహసీల్దార్ కార్యాలయం
- పూర్తిగా పాడైపోయిన స్లాబు
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంభయంగా పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది

నాగులుప్పలపాడు: దశాబ్దాల కాలం నాటి భవనాలు కావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందో అని అధికారులు భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. పూర్తిగా పాడైపోయి పెచ్చులూడుతున్న భవనంతో ప్రమాదం ఏ రూపంలో జరుగుతుందో అని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహించాల్సి వస్తోందంటున్నారు. నాగులుప్పలపాడు తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని నిర్మించి సుమారు 4 దశాబ్దాలు అవుతోంది. అప్పట్లో ఈ నిర్మాణాలను చెరువును పూడ్చి చేపట్టడంతో జీవిత కాలం చాలా వరకు తగ్గిపోయింది. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం గోడలు మొత్తం డొల్లగా మారడంతో పాటు స్లాబు పూర్తిగా దెబ్బతిని చిన్నపాటి వర్షానికి సైతం నీరు కారుతోంది. దీనికితోడు భవనానికి ఏర్పాటు చేసిన పిల్లర్లు శిథిలమై పగిలిపోయి చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. 2 నెలల కిందట కురిసిన వర్షాలకు కార్యాలయం గోడలు పూర్తిగా నీరు ఒడిచి కార్యాలయంలోని వీఆర్వోల గదిలో స్లాబు పెచ్చులూడి వీఆర్వోలు పనిచేసే టేబుల్‌పై పడింది. అయితే ఆ సమయంలో కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. నూతన భవనానికి అంచనాలను ఎప్పటికప్పుడు పంపిస్తున్నా.. నేటికీ నిర్మాణంగానీ, కనీసం బాగుచేయించడం గురించిగానీ ప్రభుత్వం చొరవ చూపడకపోవడంతో కార్యాలయానికి వెళ్లే రైతులు, ప్రజలు లోపల కాసేపు నిలబడటానికి కూడా భయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నూతన భవనానికి అనుమతిచ్చి నిర్మాణం చేయాలని కోరుతున్నారు.



పెచ్చులూడిన స్లాబు



కుంగిపోయిన ఫ్లోరింగ్



పూర్తిగా శిథిలమై పెచ్చులూడిన పిల్లర్లు



నాగులుప్పలపాడు తహసీల్దార్ కార్యాలయం (ఫైల్)

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశం

ఒంగోలు టౌన్: జిల్లాలో రోజూ 25 నుంచి 30 కుటుంబాలు లేదా 18 ఏళ్లు పైబడిన 60 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యాధికారులను జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం తన కార్యాలయం నుంచి ఆయన జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. అధిక రక్తపోటు, షుగర్ పరీక్షలు కూడా చేయాలని సూచించారు. క్యాన్సర్ అనుమానితులను ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు వైద్యాధికారికి రెఫర్ చేయాలని, ఆ కేసులను వెంటనే జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్‌కు వైద్యాధికారులు రెఫర్ చేయాలని వివరించారు. నివేదిక ప్రకారం జనాభాలో 26 శాతం మంది సుగర్, 30 శాతం మంది రక్తపోటుతో బాధపడుతున్నారని, వారిని గుర్తించి వెంటనే తగిన వైద్య చికిత్స అందించి యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఎన్‌సీడీ, సీడీ3ఓ కార్యక్రమం కింద ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యలను విధిగా సాధించాలని ఆదేశించారు. లేకుంటే వైద్యాధికారులు, సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్సీడీ, సీడీ నోడల్ అధికారి డాక్టర్ భగీరధి, డీపీఎంఓ డాక్టర్ వాణిశ్రీ, ఎపిడిమాలజిస్ట్ విక్టర్ కుమార్, డేటా మేనేజర్ చల్లా ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.



జూమ్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు

ఉపాధి పనులను వేగవంతం చేయండి

సంతనూతలపాడు: మండలంలోని గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయిలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులను సంప్రదించి ఉపాధి పనులను గుర్తించాలని సూచించారు. పనుల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఎస్ఎస్ఎస్ గ్రూపులు ఏర్పాటు చేయాలన్నారు. మండలానికి 60 రైతువారీ కుంటలు మంజూరైనట్టు తెలిపారు. వాటి ఎస్టిమేట్లు సిద్ధం చేయాలన్నారు. గోకులం పశువుల షెడ్ల నిర్మాణాలను నూరు శాతం పూర్తి చేయాలని చెప్పారు. గ్రామాల వారీగా ఉపాధి పనులపై ఎంపీడీవో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ మండల ఏపీవో వాసంతి, ఈసీ బాబు, టీఏ, ఎఫ్ఏలు, సీఓఏలు పాల్గొన్నారు.



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

ఆస్పత్రికి కుర్చీల వితరణ

ఒంగోలు టౌన్: నగరంలోని మాతా శిశు వైద్యశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు లెజెండరీ సిటిజన్స్ తన వంతు సాయంగా 80 వేల రుపాయల విలువ చేసే ఎయిర్ పోర్టు కుర్చీలను అందజేసింది. గురువారం మాతా శిశు వైద్యశాలలో జరిగిన సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరావు మాట్లాడుతూ అడిగిన వెంటనే వైద్యశాలకు వచ్చే రోగులు కూర్చునేందుకు కుర్చీలు అందజేసిన లయన్స్ లెజెండరీ సిటిజెన్స్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత సహాయ సహకారాలు అందజేస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. లయన్స్ క్లబ్ ప్రసిడెంట్ అడపాల అయ్యప్ప మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు లయన్స్ క్లబ్ నిరంతరాయంగా కొనసాగిస్తుందని చెప్పారు. వైద్యశాలకు వచ్చే వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు సహకరించిన డాక్టర్ జయకిషోర్, ఎం.నరసింహారావు, సోలేటి వెంకట్, అతడి మిత్ర బృందానికి ధన్యవాదాలు తెలిపారు. చిట్టెం రెడ్డి శ్రీనివాసరెడ్డి, నయనాల రామకృష్ణ, అడుసుమల్లి వెంకటరావు, జీవీ సుబ్బారావు, మేడిశెట్టి సుబ్బారావు, రవి కుమార్ పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ అందజేసిన కుర్చీలు

వైభవంగా కల్యాణోత్సవం



హాజరైన భక్తులు



మడనూరులో రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వాముల కల్యాణోత్సవం

కొత్తపట్నం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం వేకువ జామున కల్యాణోత్సవం వైభవంగా సాగింది. గ్రామ పెద్దలు, ఈవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రామలింగేశ్వర స్వామి, కన్నేశ్వరస్వామిలకు పూజా కార్యక్రమాలు చేసి కల్యాణోత్సవం నిర్వహించారు. కొత్తపట్నం నాగేశ్వరస్వామి ఆలయంలో ఈవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శివ, పార్వతలకు కల్యాణం నిర్వహించారు. దంపతులు కల్యాణం ముందు పూజలు చేశారు. భక్తులు ఓం నమశివాయ.. హర హర మహాదేవ శంభోశంకర అంటూ ఒక్కసారిగా పోటెత్తారు. ఆలయం ప్రాంగణంలో భక్తులు బారులు తీరారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులు సముద్రస్నానాలు చేసిన అనంతరం ఆలయానికి వచ్చి దర్శనం చేసుకున్నారు. తీర్థప్రసాదం పంపిణీ చేశారు. కొత్తపట్నం నాగేశ్వరస్వామి ఆలయంలో వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మద్దిపాడు: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో రాచవారిపాలెం వెళ్లే దారిలో బుధవారం రాత్రి కారు ఢీకొని కోనంకి నరసయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108 ద్వారా ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం నరసయ్య మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు మద్దిపాడు పోలీసులు అప్పగించారు. స్థానిక ఎస్ఐ శివరామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు బాగా చదివి రాణించాలి

సంతనూతలపాడు: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఒంగోలు డిప్యూటీ డీఈఓ ఏ చంద్రమౌళేశ్వర్ కోరారు. సంతనూతలపాడు మండలం కొనగానివారిపాలెం చ స్కూల్లో గురువారం నిర్వహించిన వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు మంచి మార్కులతో సంతనూతలపాడు మండల స్థాయిలో పేరుప్రఖ్యాతులు తెచ్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సామగ్రిని సంతనూతలపాడు మెడికల్ ఆఫీసర్ పమిడి హరిణి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.తిరుపతిరెడ్డి దంపతులు అందించారు. వాటిని డిప్యూటీ డీఈవో చంద్రమౌళేశ్వర్, ఎంఈఓ డి.వెంకారెడ్డి, సంతనూతలపాడు హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ప్రమోద, కొనగానివారిపాలెం హైస్కూల్ హెచ్‌ఎం గుణప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం సంతనూతలపాడు మెడికల్ ఆఫీసర్ పమిడి హరిని, తిరుపతిరెడ్డి దంపతులను డిప్యూటీ డీఈవో సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కొనగానివారిపాలెం సర్పంచి నాదెండ్ల మల్లయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



మెడికల్ ఆఫీసర్ హరిణి, తిరుపతిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న డిప్యూటీ డీఈవో చంద్రమౌళేశ్వర్

హరిహరక్షేత్రంలో భక్తిశ్రద్ధలతో శాంతి కల్యాణోత్సవం



హరిహరక్షేత్రంలో శివలింగాన్ని దీపాలతో అలంకరిస్తున్న ఆలయ నిర్వాహకులు

చీమకుర్తి: శివరాత్రి వేడుకలను పురస్కరించుకుని బుధవారం రాత్రి చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో భక్తిశ్రద్ధలతో శాంతి కళ్యాణోత్సవం నిర్వహించారు. తొలుత స్వామివారికి విశేష పూజలు నిర్వహించి లింగోద్భవకాలంలో జ్యోతిర్లింగార్చన, అభిషేకాలు నిర్వహించారు. శిద్దా సుధాకర్, బాలాజీతో పాటు ఆలయ ట్రస్ట్ నిర్వాహక కుటుంబ సభ్యులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యతో పథకాలు

తర్లుపాడు: మండలంలోని రైతులు తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని ఏవో వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం మండలంలోని రాగసముద్రంలో ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు విశిష్ట గుర్తింపు నంబర్ అందరూ నమోదు చేసుకోవాలన్నారు. ఈ నంబర్‌తోనే పథకాలు అందుతాయని చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రీ ఉపయోగాలు గురించి రైతులకు వివరించారు. ఆధార్, వన్–బీ, లింకు మొబైల్ నెంబరుతో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

ఒంగోలు సిటీ: పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ కిశోర్‌బాబు అన్నారు. గురువారం ఒంగోలు మండల పరిధిలోని కొప్పోలు, చెరువుకొమ్ముపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కర్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ– పంట నమోదు చేసుకున్న ప్రతి ఒక్క రైతు ఈకేవైసీ చేయించుకోవాలని, అప్పుడు మాత్రమే రైతుకు నష్టపరిహారం వచ్చేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. రైతుకు 11 అంకెల విశిష్ట నంబర్ కోసం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద పేర్లు నమోదు చేసుకొని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. వ్యవసాయ విస్తరణాధికారులు ఆదిమూర్తి, రామకృష్ణారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు హిమబిందు, హైమావతి, పాల్గొన్నారు.

మడనూరు బీచ్‌లో మెరైన్ పోలీసుల బందోబస్తు



మడనూరు సుముద్ర తీరంలో మెరైన్ పోలీసులు

మడనూరు (కొత్తపట్నం): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం అనంతరం ఆనవాయితీ ప్రకారం మడనూరు బీచ్‌లో భక్తులు గురువారం సముద్ర స్థానం ఆచరించారు. ఈ సందర్భంగా ఎస్సై పి.సుబ్బారావు ఆధ్వర్యంలో మెరైన్ పోలీసులు గురువారం వేకువ జాము నుంచి తీరానికి చేరుకున్నారు. ఉదయం 5 గంటలకే తీరంలో భక్తులు ఒక్కసారిగా పోటెత్తారు. మెరైన్ పోలీసులు అలలు వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులను లోనికి వెళ్లనీయకుండా లైఫ్ జాకెట్స్ సాయంతో మధ్యాహ్నం వరకు బందోబస్తు నిర్వహించారు. ఎటువంటి ప్రాణహాని జరగకుండా ఎస్సై పి.సుబ్బారావు పర్యవేక్షించారు.

టీటీడీ సహకారంతో రామాయణ ప్రవచనాలు

చీమకుర్తి: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మపరిషత్ సహకారంతో గురువారం రాత్రి చీమకుర్తిలోని శ్రీసీతారామస్వామి మందిరంలో రామాయణ ప్రవచనాల కార్యక్రమం నిర్వహించారు. మానవజన్మ సార్థకత, ఆధ్యాత్మిక మార్గాలు, భక్తులకు శ్రీరాముడి అనుగ్రహం, ఇత్యాది అంశాలపై ఉదాహరణలతో భక్తులకు వివరించారు. స్థానిక భక్తులు పాల్గొన్నారు.

పీ4ను పరిశీలించిన ఎంపీడీవో

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు సచివాలయం పరిధిలో గల బీసీ కాలనీలో గురువారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు పీ4 సర్వేను పరిశీలించారు. సచివాలయ సిబ్బందికి సలహాలు, సూచనలు చేశబూరు. పంచాయతీ కార్యదర్శి రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు యువకుల ఘర్షణ

ఒంగోలు టౌన్: పాత కక్షల నేపథ్యంలో ఇద్దరు యువకులు ఘర్షణ పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. పేర్నమిట్టకు చెందిన ఏలూరు అరుణ్ కుమార్, దాసరి సుధాకర్ మధ్య గతంలో మనస్పర్థలు ఉన్నాయి. ఈ క్రమంలో మహా శివరాత్రి పండుగ సందర్భంగా గ్రామంలోని శివాలయం వద్ద జరుగుతున్న ఉత్సవంలో ఇద్దరూ గొడవపడి కొట్టుకున్నారు. గాయపడిన ఇద్దరూ జీజీహెచ్‌లో చికిత్స పొంది ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసుకున్నారు. కులం పేరుతో తిట్టాడని ఒకరు, తన వెంట వచ్చిన కుటుంబ సభ్యులు, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించాడని మరొకరు ఫిర్యాదు చేశారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ ఇద్దరూ టీడీపీ సానుభూతిపరులని సమాచారం.